క్లుప్తంగా

భూసార పరీక్షలు తప్పనిసరి



భూసార పరీక్ష కోసం మట్టి నమూనాలను సేకరిస్తున్న అధికారులు, రైతులు

కళ్యాణదుర్గం రూరల్: పంటల సాగుకు ముందు రైతులు తప్పనిసరిగా భూ సార పరీక్షలు చేయించుకోవాలని అనంతపురం భూసార పరీక్షా కేంద్రం వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరి సూచించారు. బుధవారం చాపిరి గ్రామంలో ఎరువుల యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ మూడేళ్లకోసారి మట్టి పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. మట్టి నమూనాలు ఎలా సేకరించాలో రైతులకు అవగాహన కల్పించారు. చాపిరి పీఏసీఎస్ ఎస్ఎస్ డీఎల్ సీఓ డీఐసీ నాగభూషణరెడ్డి, ఏఈఓ దిలీప్, వీఏఏ సుజాత పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంధం



అలంకరణలో షాబాజ్ దీవాన్ వలీ సమాధి

బొమ్మనహాళ్: మండలంలోని కళ్లహోళ గ్రామంలో వెలసిన సయ్యద్ హజరత్ షా షాబాజ్ దీవాన్ వలీ ఉరుసు ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున దర్గా నిర్వాహకుల నివాసం నుంచి గంధం ఊరేగింపుగా దర్గాకు చేర్చారు. వందలాదిగా తరలి వచ్చిన భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గురువారం సాయంత్రం 7 గంటలకు దీపారాధన కార్యక్రమం జరగనుంది.

కూలీల నుంచి ఫిర్యాదులొస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ కుళ్లాయి స్వామి

కూడేరు: ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించలేదని కూలీల నుంచి ఫిర్యాదులొస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎంపీడీఓ కుళ్లాయి స్వామి హెచ్చరించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో పనుల కల్పనపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. రోజుకు 2,288 మంది కూలీలకు పనులు కల్పించేలా మండలానికి లక్ష్యం నిర్దేశించారన్నారు. మీరేమో 1,200 మందికే పనులు కల్పిస్తే ఎలా అని ప్రశ్నించారు. గ్రామసభలు నిర్వహించి ఉపాధి పనుల గురించి కూలీలకు అవగాహన కల్పించి ఎక్కువ మంది కూలీలు పనులకు వచ్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పనులు కల్పించడంలో ఎవరూ నిర్లక్ష్యం వహించవద్దన్నారు. కార్యక్రమంలో ఏపీఓ పోలేరయ్య, ఇంజనీర్ రాజేష్, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కేసు నమోదు

వజ్రకరూరు: మండల పరిధిలోని ధర్మపురి గ్రామానికి చెందిన కె.వెంకట చలమయ్య అనే వ్యవసాయ కూలీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన అనిల్ యాదవ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు. ఈనెల 12వ తేదీన ధర్మపురి గ్రామంలో పొలం విషయమై కె.వెంకట చలమయ్యను అదే గ్రామానికి చెందిన అనిల్ యాదవ్ బెదిరించాడు. కట్టెతో కొట్టడంతో వెంకట చలమయ్య కాళ్లు, చేతులకు దెబ్బలు తగిలాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

దేవతలారా దీవించండి



అక్క దేవతలకు పూజలు చేస్తున్న అర్చకుడు

ఆత్మకూరు: మండల కేంద్రంలో అక్క దేవతల జాతర భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది. బుధవారం అక్క దేవతలను ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. విశేష పూజలు చేసి, మంగళహారతి ఇచ్చారు. పలువురు పన్నేరపు బండ్లను వివిధ రకాల రంగుల కాగితాలతో అలంకరించి ఆలయం చుట్టూ తిప్పారు. భక్తులు పెద్ద ఎత్తున టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ వారు భక్తులకు ప్రసాదం అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు.



ఆలయ పరిసరాల్లో భక్తుల సందడి

మరుగుదొడ్ల తాళాలు తీస్తే ఒట్టు



ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గేటు పక్కనే నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

కూడేరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉన్న సచివాలయాలు–1, 2, ఎంపీడీఓ, అగ్రికల్చర్, వెలుగు కార్యాలయాలకు వచ్చే ప్రజల సౌకర్యార్థం 'స్వచ్ఛ భారత్' కింద రూ.6 లక్షలు ఖర్చు పెట్టి రెండు మరుగుదొడ్లు నిర్మించారు. వీటిని ప్రారంభించక పోవడంతో నిరుపయోగంగా మారాయి. పనుల నిమిత్తం వచ్చే మండల ప్రజలు ప్రధాన గేటు, కార్యాలయాల పక్కనే మలమూత్ర విసర్జన చేస్తున్నారు. కార్యాలయ పరిసరాలు కంపుకొడుతున్నా సంబంధిత అధికారులు మాత్రం మరుగుదొడ్లను వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టడం లేదు. అధికారుల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు.

ఇలాగైతే రోగాలు రావా ?



వడ్డే కాలనీలో తాగునీటి కుళాయి నీటి గుంతలో కలుషిత నీరు

కళ్యాణదుర్గం: మున్సిపాలిటీలో తాగునీరు కలుషితమవుతోంది. మంచినీరు అందించాల్సిన మున్సిపల్ అధికారులు ప్రజలకు కలుషిత నీటిని అందిస్తూ రోగాలను కొని తెచ్చిపెడుతున్నారు. ధర్మవరం రోడ్డులోని వడ్డే కాలనీ ప్రధాన రహదారి పక్కన ఓ ఇంటి ముందు తాగునీటి కుళాయిల కోసం తవ్విన గుంతల్లో మురుగునీరు చేరింది. గుంత పూర్తిగా మురుగునీటితో నిండిపోయి మురుగునీటి గుంటలా తలపిస్తోంది. ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాల్సిన మున్సిపల్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో కలుషిత నీటితో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు.

బండ్ల పరుపు రోడ్డే గతి !



ముస్లంబావి వద్ద నేటికీ ఉపయోగిస్తున్న బండ్ల పరుపు రోడ్డు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 24వ వార్డు ముస్లంబావి వద్ద ఉన్న వీధిలో నేటికీ బండ్ల పరుపు రోడ్డే దర్శనమిస్తోంది. కాలం మారి సీసీ రోడ్లు వచ్చినా ఆ వీధివాసులు నేటికీ బండ్ల పరుపు రోడ్డుపైనే రాకపోకలకు సాగిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

'సేవ్ ఆర్డీటీ' బైక్ ర్యాలీకి తరలిరండి

- మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: ఆర్డీటీ సంస్థ ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరణకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 17న చేపట్టిన 'సేవ్ ఆర్డీటీ' బైక్ ర్యాలీ కార్యక్రమానికి ప్రజలు తరలిరావాలని మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, పార్టీ నేత మాదినేని ఉమామహేశ్వరనాయుడు, ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తలారి రంగయ్య, పార్టీ నేత ఉమా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలతో గద్దెనెక్కి ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రభుత్వం సంక్షేమం పక్కనబెడితే ప్రభుత్వానికి దీటుగా సేవలందిస్తున్న ఆర్డీటీ తన సేవలు ఆపేస్తే అనంతపురం జిల్లాలో పరిస్థితి ఎలా ఉంటుందో తెలుస్తోందన్నారు. ఆర్డీటీ సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బ్రహ్మసముద్రం నుంచి బైకు ర్యాలీ ప్రారంభమై శెట్టూరు, కుందుర్పి, కంబదూరు మీదుగా కళ్యాణదుర్గం చేరుకుంటుందన్నారు. మున్సిపల్ ఛైర్మన్ రాజ్‌కుమార్, వివిధ విభాగాల కార్యదర్శులు నరేంద్రరెడ్డి, యర్రంపల్లి కృష్ణమూర్తి, హనుమంతరెడ్డి, కరణం రాహుల్, తలారి సత్తి, జడ్పీటీసీ బొమ్మన్న, మున్సిపల్ విభాగం కన్వీనర్ ఐ సుధీర్, వివిధ మండలాల కన్వీనర్లు కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, గోళ్ల సూరి, ఎంఎస్ రాయుడు, హనుమంతరాయుడు, పార్టీ అధికార ప్రతినిధి గోపారం శ్రీనివాసులు, ఎంపీపీలు ఆంజినేయులు, నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు లక్ష్మన్న, పరమేశ్వరప్ప, హరి, దొడగట్ట నారాయణ, వివిధ విభాగాల నియోజకవర్గ అధ్యక్షులు తిప్పేస్వామి, నరసింహులు, చరణ్, పాతలింగ, భాస్కర్, పాండు, అజయ్, ప్రతాప్,రామిరెడ్డి, మల్లికార్జున, తిమ్మారెడ్డి, కిరీటి యాదవ్, కాంతమ్మ, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య, ఉమా



ఉప్పర రాజు కుటుంభ సభ్యులను పరామర్శిస్తున్న మాజీఎంపీ తలారి రంగయ్య

మృతుడి కుటుంబానికి పరామర్శ

కుందుర్పి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ నేత ఉప్పర రాజు కుటుంబాన్ని బుధవారం మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య పరామర్శించారు. రాజు భార్య కళావతితోపాటు ఇద్దరు పిల్లలకు పార్టీ అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం రూ.30 వేలు నగదు అందజేశారు. అనంతరం ఇదే ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న జెడ్పీటీసీ రాధాస్వామిని పరామర్శించారు. ఎంపీపీ నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కే.హనుమంతరాయుడు, మాజీ సర్పంచులు లింగప్ప, తిప్పేస్వామి, సర్పంచ్ గంగాధర, వన్నూర్‌రెడ్డి, భీమప్ప, తిమ్మరాజు, రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్

ఉరవకొండ రూరల్: అన్నీ శాఖల సమయన్వయంతో ఈనెల 17న జరిగే పెన్నహోబిలం లక్ష్మీనృసింహ స్వామి రథోత్సవాన్ని విజయవంతం చేద్దామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి తిప్పేనాయక్ తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పెన్నహోబిలం బ్రహ్మ రథోత్సవం విజయవంతం కోసం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ.. రథోత్సవం తిలకించేందుకు వచ్చే భక్తులకు తాగునీరు, భోజనం, వసతి ముఖ్యంగా కల్పించాలన్నారు. దీంతో పాటు విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ కోతలు లేకుండా చూడాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ వారు తాగునీరు, భక్తులకు తాత్కలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుకోకుండా పోలీసులు చూడాలన్నారు. పెన్నహోబిలం ఆలయ ఈఓ సాకే రమేష్‌బాబు మాట్లాడుతూ.. భక్తులకు పూర్తి స్థాయిలో వసతులు కల్పించి ఎక్కడా ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూస్తామన్నారు. సమావేశంలో తహసీల్దార్, ఎంపీడీఓలు మహబూబ్‌బాషా, రవిప్రసాద్, సీఐ మహనంది, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ జేఈలు విజయ్య, గురుమూర్తి, ఆర్టీసీ డీఎం హంపయ్య, వైద్యాధికారులు డాక్టర్ అనికేత్, వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌ల్యాండ్‌లో కనిపించని భూముల వివరాలు

కూడేరు: మండల పరిధిలోని కలగళ్ల, చోళసముద్రం, ఇప్పేరు, కూడేరు, ముద్దలాపురం, కరుట్లపల్లితో పాటు మరికొన్ని గ్రామాల రైతులు బుధవారం డిప్యూటీ తహసీల్దార్ సూర్య ప్రతాప్‌ను కలిశారు. 'మీసేవ కేంద్రంలో తమ భూములకు సంబంధించి కంప్యూటర్ అడంగల్, 1బీ వస్తున్నాయి. కానీ బ్యాంక్‌ల్లో పంట రుణాలు రెన్యూవల్ చేసుకోవడానికి, కొత్త రుణాలు తీసుకునేందుకు వెళితే అక్కడ వెబ్‌ల్యాండ్‌లో కనిపించడం లేదు' అని సమస్యను విన్నవించారు. డిప్యూటీ తహసీల్దార్ బ్యాంక్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రెవెన్యూ వెబ్‌ల్యాండ్‌లో భూ వివరాలు ఉన్నాయి. మీకు రాతపూర్వకంగా సంతకాలు చేసి లెటర్ ఇస్తామని.. దాని ఆధారంగా రైతులకు రుణాలు ఇచ్చి, రెన్యూవల్ చేయాలని సూచించారు. బ్యాంక్ నిబంధనల మేరకు తమ వెబ్‌ల్యాండ్‌లో కనిపించాలని బ్యాంక్ అధికారులు సూచించారు. దీంతో డీటీ విషయాన్ని రెవెన్యూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. టెక్నికల్ సమస్యతో భూ వివరాలు కనిపించకపోయి ఉండవచ్చు. వారం రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు. ఇదే విషయాన్ని డీటీ రైతులకు తెలపడంతో వెనుదిరిగారు.

తెరచుకున్న మినరల్ వాటర్ ప్లాంట్



కల్లుహోళలో తెరుచుకున్న వాటర్‌ప్లాంట్

బొమ్మనహాళ్: గత కొన్ని నెలలుగా మూతపడిన మినరల్ వాటర్ ప్లాంట్ ఎట్టకేలకు ఈఓపీఆర్‌డీ దాస్ చొరవతో బుధవారం తెరుచుకుంది. వేసవి కావడంతో కల్లుహోళ గ్రామంలో తాగునీటి సమస్య అధికమైంది. గ్రామంలో వచ్చే కొళాయినీరు బాగలేకపోవడంతో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న ఈఓపీఆర్‌డీ దాస్ గ్రామ పంచాయతీ ఆధీనంలో మినరల్‌వాటర్ ప్లాంట్‌ను పునః ప్రారంభించారు.

రేషన్ బియ్యం పట్టివేత

బొమ్మనహాళ్: మండలం నుంచి అక్రమంగా కర్ణాటకకు బొలెరో వాహనంలో తరలిపోతున్న రేషన్ బియ్యాన్ని బుధవారం విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. విజిలెన్స్ సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. బొమ్మనహాళ్ మండలంలోని పలు గ్రామాల్లో పేదల నుంచి తక్కువ ధరకే కొనుగోలు చేసిన 28 క్వింటాళ్ల (48 బస్తాల) రేషన్ బియ్యన్ని బొలెరో వాహనం (కేఏ14 సీ2153) లో కర్ణాటక రాష్ట్రంలోని చెల్లికేరకు తరలిస్తుండగా బుధవారం విజిలెన్స్ అధికారులు దాడులు చేసి మండలంలోని బందూరు వద్ద పట్టుకున్నట్లు చెప్పారు. బొలెరో వాహనాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీకాంత్ నాయక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. బియ్యాన్ని తరలిస్తున్న డ్రైవర్ హరిజన లక్ష్మన్, బియ్యం వ్యాపారస్తులు గూని యల్లప్పపై బొమ్మనహాళ్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు విజిలెన్స్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో డీసీటీఓ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న రేషన్‌బియ్యాన్ని చూపుతున్న విజిలెన్స్ అధికారులు

రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యకు నమోదు చేసుకోండి

వజ్రకరూరు: రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యకు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మధుకర్ సూచించారు. బుధవారం మండలంలోని గంజికుంట రైతుసేవా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతు సేవా కేంద్రం ద్వారా రైతులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. మండలంలో మొత్తం 13 వేల మంది రైతులు ఉండగా.. ఇప్పటి వరకూ 9,900 మంది రైతులు రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యకు నమోదు చేసుకున్నట్లు వెల్లడించారు. గుర్తింపు సంఖ్య ఆధారంగా రైతులకు రాయితీలు, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సురెన్సు, వాతావరణ బీమా, అన్నదాత సుఖీభవ తదితర పథకాలు అందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీహెచ్ఏ కృపా తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకోండి

గుమ్మఘట్ట: నూతన రేషన్‌కార్డుల కోసం అర్హత ఉన్నవారు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. బియ్యం కార్డుల్లో సభ్యుల చేరిక, సభ్యుల తొలగింపు, చిరునామా మార్పు , కార్డుల్లో తప్పులు ఉంటే సరిచేసుకోవాలని సూచించారు.

17న వాహనాల వేలం

బొమ్మనహాళ్: స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో వివిధ మద్యం కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను ఈనెల 17న స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో వేలం వేస్తున్నట్లు ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.వెయ్యి చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చన్నారు.

బిల్లుల చెల్లింపులో పారదర్శకత అవసరం

కుందుర్పి: ఉపాధి హామీ బిల్లుల చెల్లింపులో సిబ్బంది పూర్తి పారదర్శకత పాటించాలని ఎంపీడీఓ లక్ష్మీ శంకర్, ఏపీఓ బాలకృష్ణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందికి పనుల గుర్తింపు, బిల్లులు చెల్లింపు, డ్రైల్యాండ్ హార్టికల్చర్ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. 2025–26కు సంబంధించి జూన్ నుంచి డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద 13 గ్రామ పంచాయతీల్లో మరో 470 ఎకరాల్లో పండ్లతోటలు పెంపకానికి ఆన్‌లైన్ ద్వారా చిన్నసన్నకారు రైతుల నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. కూలీల బిల్లుల విషయంలో అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కళ్యాణదుర్గం రూరల్: చాపిరి గ్రామంలో పేకాట స్థావరంపై కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు బుధవారం దాడులు చేశారు. పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్ట్ చేసి రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

రాయదుర్గంటౌన్: మండలంలోని టీ.వీరాపురం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన తలారి సుంకన్న రోడ్డు దాటుతుండగా కణేకల్లు వైపు నుంచి వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సుంకన్న చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందజేశారు.

20న వరిగడ్డి వేలం

కణేకల్లు: కణేకల్లులో ఎస్ఎస్ఎంఎఫ్ ఫాం వరిగడ్డిని ఈనెల 20న వేలం వేస్తున్నట్లు అగ్రికల్చర్ ఫాం ఏడీఏ నారాయణ నాయక్ తెలిపారు. 72.50 ఎకరాల వరి గడ్డిని వేలం వేస్తున్నట్లు పేర్కొన్నారు. వేలంపాటలో పాల్గొనే వారు డిపాజిట్ కోసం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, కణేకల్లు ఫాం పేరిట రూ.లక్ష డీడీ తీయాలన్నారు.

అన్నదానం

ఉరవకొండ: స్థానిక విఠల్ రుక్మిణి అనాథ వృద్ధాశ్రమంలో ఆమిద్యాల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆమిలినేని అనిల్ బుధవారం అన్నదానం చేశారు. తండ్రి ఆమిలినేని శ్రీనివాసులు జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాల్లో భాగంగా తల్లి ఓబుళమ్మతో కలిసి వృద్ధులకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో ఆమిద్యాల గ్రామ నాయకులు ఎర్రిస్వామి, దాసరి అనిల్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల అట్రాసిటీ చట్టం తేవాలి

కళ్యాణదుర్గం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం తరహాలో దివ్యాంగులకు చట్టం తేవాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు వసంత్‌బాబు కోరారు. బుధవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక పట్టణ కమిటీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంత్‌బాబు మాట్లాడుతూ దివ్యాంగులకు పట్టణ సమీపంలో ఇంటి పట్టాలను మంజూరు చేయాలన్నారు. వేదిక నాయకులు రామయ్య, రాజేష్, నాగరాజు ఖాజా, రాము తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న ఐచర్

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం సమీపంలోని దొడగట్ట వద్ద అనంతపురం, రాయదుర్గం బైపాస్‌రోడ్డుపై బుధవారం తెల్లవారుజామున వేగాన్ని నియంత్రిచలేక ఐచర్ వాహనం డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. పట్టణ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

నైట్ సర్వీసు బస్సు నడపాలి

విడపనకల్లు: ఉరవకొండ ఆర్టీసీ డిపో నుంచి ఉండబండ, పాల్తూరు, కళ్లవల్లితిప్ప గ్రామాల మీదుగా బొల్లనగుడ్డం గ్రామానికి రెగ్యులర్‌గా నైట్ సర్వీసు బస్సును నడపాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. గతంలో రాత్రి 8:30 గంటలకు నైట్ సర్వీసు బస్సు ఉండటంతో ప్రజలు సొంత గ్రామాలకు వెళ్లేవారు. ప్రస్తుతం నైట్ సర్వీసు బస్సును ఆర్టీసీ అధికారులు రద్దు చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి రోజూ బొల్లన గుడ్డం గ్రామానికి నైట్ సర్వీసు బస్సును నడపాలని కోరుతున్నారు.

ఎయిడ్స్ బాధితులపై వివక్ష చూపొద్దు



ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: ఎయిడ్స్ బాధితులపై వివక్ష చూపకూడదని పలువురు వక్తలు అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని కొనకొండ్ల గ్రామంలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై తరిమెల రాజు కళాజాత బృందంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి ఐసీటీసీ కౌన్సిలర్ ప్రసాద్, డీఎస్ఆర్‌సీ కౌన్సిలర్లు పీర్‌నాయక్, ప్రగతిమైత్రి మహిళా సంఘం గుంతకల్లు ప్రాజెక్టు మేనేజర్ రమేష్, ఎంఈఏ రాధ, ఏఎన్ఎం నజీమున్నిసా పాల్గొన్నారు.

రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలి

విడపనకల్లు: మండలానికి రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలని ప్రజలు కోరుతున్నారు. ఐదు నెలలుగా రెగ్యులర్ తహసీల్దార్ లేకపోవడంతో రైతులు, విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాల్సిన అవసరం ఉంది.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం మాజీ సర్పంచ్ వసుంధరమ్మ(65) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈమె కళ్యాణదుర్గం మేజర్ పంచాయతీగా ఉన్న సమయంలో సర్పంచ్‌గా పని చేశారు. ఈమెకు భర్త మల్లికార్జున, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు.

ఉద్యోగులు ఉన్నట్టా .. లేనట్టా?



దేవగిరి గ్రామ సచివాలయంలో ఖాళీ కుర్చీలు కనిపిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: మండలంలోని పలు గ్రామ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదని, ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. మండలంలోని దేవగిరి సచివాలయ సిబ్బంది బుధవారం ఉదయం 11.30 గంటలకు వచ్చారని, అయితే తలుపులు మాత్రం తీసిపెట్టి బయట తిరుగుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం 3 గంటలైన రాకపోవడంతో వివిధ పనుల నిమిత్తం సచివాలయానికి వచ్చిన వారు ఉద్యోగులకు ఫోన్లు చేసినా స్పందించలేదంటున్నారు. రోజూ వీఆర్‌ఓ, పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండటం లేదంటున్నారు. అసలు సచివాలయ ఉద్యోగులు ఉన్నారా ? లేదా ?అని కూడా అర్థం కావడం లేదని వాపోతున్నారు.

హనుమద్ వాహనంపై వేంకటరమణుడు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీవారు భక్తులకు హనుమద్ వాహనంపై దర్శనమిచ్చారు. సాయంత్రం శ్రీవారి హనుమద్ వాహనాన్ని పుర వీధుల్లో ఊరేగించారు. అంతకుముందు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. గురువారం స్వామివారి కల్యాణోత్సవాన్ని ఉదయం 11.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఈఓ నరసింహారెడ్డి తెలిపారు.



హనుమద్ వాహనంపై ఊరేగుతున్న వేంకటరమణస్వామి